## క్లుప్తంగా

### ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రగతి హైస్కూల్లో ప్రీప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు బుధవారం జరిగాయి. ప్రగతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ మక్కెన అచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా తమవంతు కృషి చేయాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మక్కెన పద్మజ, ప్రిన్సిపల్ మస్తాన్ వలి, శ్రీకాంత్, శ్రీలత, షఫీ, అమూల్య, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు రూ.2 లక్షల విలువైన సైన్స్ పరికరాలు



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన పాతూరి ఆంజనేయులు రూ.2 లక్షల విలువ చేసే సైన్స్ లేబొరేటరీ సామగ్రిని బుధవారం అందించారు. ఆంజనేయులును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మిరియమ్మ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాతూరికోటేశ్వరరావు, ఉపాధ్యాయులు సన్మానించారు.

### మాగులూరి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

పెదకూరపాడు: స్థానిక మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నారై భానుప్రకాష్ సహకారంతో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న లగపాడు గ్రామానికి చెందిన సాంబయ్యకు ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్‌కుమార్, సిద్ధయ్య, ప్రసాద్ అందజేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్షా సామగ్రి, నోట్‌పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు అందజేశారు.

### యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్‌ను జయప్రదం చేయాలి



సత్తెనపల్లి: నరసరావుపేటలో జరగనున్న యూటీఎఫ్ పల్నాడు జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు కోరారు. పట్టణంలో ఎంఈవో కార్యాలయ ఆవరణలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సత్తెనపల్లి మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.విష్ణుమూర్తి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కిషోర్ కుమార్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

### హనుమాన్ చాలీసా పారాయణం



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): గోళ్ళపాడులోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం బుధవారం నిర్వహించారు. పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా హనుమత్ దీక్ష చేపట్టిన మాలధారులు హనుమాన్ చాలీసా 108 సార్లు పారాయణం నిర్వహించారు. స్వామి తిరునాళ్ళను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

### యువకుడి గల్లంతు

చిలకలూరిపేటటౌన్: రాజమండ్రికి చెందిన యువకుడు కుప్పగంజి వాగులో స్నానానికి దిగి మృతి చెందిన ఘటన బుధవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి మండలం ఉప్పంపేటకు చెందిన నూకల సాయికుమార్ (28) జామాయిల్ కర్ర లోడు కోసం లారీ డ్రైవర్‌తో కలసి చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెంకు మంగళవారం వచ్చాడు. సాయంత్రం సమయంలో కమ్మవారిపాలెం–గోవిందపురం మధ్య నున్న కుప్పగంజి వాగులో దిగి గల్లంతయ్యాడు. వాగు ప్రవాహం తక్కువగా ఉన్నా, రైతులు తమ పొలాలకు నీళ్లు పెట్టుకొనేందుకు ఏర్పాటు చేసిన గోతిలో పడి మృతి చెందాడు. సాయి లారీ ఓనర్ సోమరాజు స్వయాన తమ్ముడు. క్లీనర్ లేకపోవటంతో డ్రైవర్‌కు సహాయకుడిగా వచ్చి ప్రమాదంలో చిక్కుకున్నాడని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మేలుకొలుపంట

- పంట నమోదుతో ప్రయోజనమెంతో..
- సత్తెనపల్లి డివిజన్‌లో 31,535 ఎకరాల్లో రబీ సాగు
- ఇప్పటివరకు 88.05 శాతం నమోదు
- ఈనెల 25 వరకు అవకాశం



కంటెపూడిలోని శనగ పొలంలో ఈ-పంట నమోదును పర్యవేక్షిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి

సత్తెనపల్లి: సాగు ప్రయోజనాలను రైతులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఈ-పంట నమోదు విధానాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తోంది. రైతులు పండించిన దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. కరువు, అధిక వర్షాల వల్ల పంటలు నష్ట పోయినప్పుడు పరిహారం అందజేస్తోంది. రైతులకు ఈ ప్రయోజనాలు అందాలంటే ఈ-పంట నమోదు చేయించుకోవడం తప్పనిసరి. మరీ ముఖ్యంగా ఈ విధానం వల్ల రైతుల సమగ్ర సమాచారం అధికారుల వద్ద ఉంటుంది. ఫలితంగా వేసిన పంటను బట్టి ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాల సమాచారం, సస్య రక్షణ చర్యలను అధికారులు కర్షకులకు తెలియజేసి మేలుకొలిపే అవకాశం ఉంటుంది.

**ఈ పంట నమోదు ఇలా..**

వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ-కర్షక్ యాప్‌లో రైతుల, పంటల సాగు వివరాలను నమోదు చేస్తారు. మొదట రైతు భరోసా కేంద్రాల్లో రైతుల వివరాల నమోదు, క్షేత్రస్థాయిలో పంటల నమోదు, చివరగా ప్రతి రైతుతో ఈ-కేవైసీ పూర్తిచేయిస్తారు. ఈ-పంట నమోదుతో రైతులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతాయి. ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి సాయం, పంటల బీమా, నష్టపరిహారం, గిట్టుబాటు ధర, ఎరువులు, పురుగు మందులపై రాయితీ వర్తిస్తాయి.

**తొమ్మిది మండలాల్లో ఇలా..**

సత్తెనపల్లి డివిజన్‌లో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని 9 మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 31,535 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. ప్రధానంగా మొక్కజొన్న, శనగ, వరితోపాటు జొన్న, నువ్వులు, సజ్జ, పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు 27,767 ఎకరాల్లో ఈ- పంట నమోదు జరిగింది. డివిజన్ వ్యాప్తంగా 88.05శాతం నమోదు పూర్తయింది. సత్తెనపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 89 శాతం నమోదైతే పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 91.31 శాతం నమోదైంది. అత్యధికంగా అచ్చంపేట మండలంలో 103 శాతం ఈ-పంట నమోదు కాగా అత్యల్పంగా రాజుపాలెం మండలంలో 84 శాతం నమోదైంది. సత్తెనపల్లి డివిజన్ వ్యాప్తంగా ఈ- కేవైసీ 76.16 శాతం నమోదు కాగా సత్తెనపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 68.16 శాతం, పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 84.17 శాతం ఈ-కేవైసీ నమోదైంది. డివిజన్‌లో అత్యధికంగా అమరావతి మండలంలో 92.45 శాతం నమోదు కాగా అత్యల్పంగా నకరికల్లు మండలంలో 47.06 శాతం ఈ-కేవైసీ నమోదైంది. ఈనెల 25 వరకు ఈ- పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది.

**మండలాలవారీగా ఇలా సాగు, పంట నమోదు ఇలా.. (ఎకరాల్లో)**

| మండలం | సాగు | ఈ-పంట నమోదు | నమోదు శాతం | ఈ-కేవైసీ శాతం |
| --- | --- | --- | --- | --- |
| సత్తెనపల్లి | 1,344 | 1,333 | 99 | 91.6 |
| ముప్పాళ్ళ | 5,327 | 4,852 | 91 | 65.5 |
| రాజుపాలెం | 5,537 | 4,667 | 84 | 67.9 |
| నకరికల్లు | 14,702 | 13,123 | 89 | 47.6 |
| పెదకూరపాడు | 966 | 899 | 93.3 | 84.57 |
| అమరావతి | 1,527 | 1,513 | 99 | 92.45 |
| అచ్చంపేట | 260 | 280 | 103 | 84.95 |
| క్రోసూరు | 879 | 877 | 99.7 | 86.96 |
| బెల్లంకొండ | 993 | 223 | 63 | 71.93 |
| మొత్తం | 31,535 | 27,767 | 88.05 | 76.16 |

**రైతులకు ఎంతో మేలు**



రైతులకు ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ చేయించుకోవడం వల్ల ఎంతో మేలు చేకూరుతోంది. ఈ-పంట నమోదైన రైతులందరూ ఈనెల 25లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారంతో ఈ ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం. దూర ప్రాంతాల్లో ఉన్న వారు ఇక్కడికి రాలేని వారు ఓటీపీ సంఖ్యలు తెలిపి చేయించుకోవచ్చు. వ్యవసాయ సహాయకుడు మాత్రమే ఓటీపీ సంఖ్య అడుగుతారు. పథకాల లబ్ధికి ఈ-కేవైసీ తప్పనిసరి.

– ఎస్.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఏ, సత్తెనపల్లి

## ప్రతిఒక్కరూ సహజసిద్ధ జీవనం గడపాలి

శ్రీపీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానందస్వామి



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న పరిపూర్ణానందస్వామి

అచ్చంపేట: ప్రతిఒక్కరూ సహజసిద్ధ జీవనం గడపాలని, వయస్సుతోపాటు వచ్చే మార్పులను ఆస్వాదించాలని శ్రీపీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానందస్వామి చెప్పారు. పల్నాడు జిల్లా చామర్రులో బుధవారం జరిగిన దేవతామూర్తుల వార్షిక ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అచ్చంపేట సాయిబాబా ఆలయం నుంచి చామర్రు వినాయకుని గుడి వరకు హరినామ స్మరణ సంకీర్తనలతో అపూర్వ ర్యాలీ నిర్వహించారు. ఆ తరువాత దేవాలయ ప్రాంగణంలో ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. అనుగ్రహభాషణ చేశారు. ముందుగా వేద పండితులతో భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామికి మహారుద్రాభిషేకం చేశారు. సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక, నాభిశిల, అభయాంజనేయస్వామి, పోలేరమ్మలకు పూజలు నిర్వహించారు. నెల్లూరి వెంకటేశ్వర్లు బృందం భజన కార్యక్రమాలు చేపట్టింది.

## మానసిక వికలాంగులకు చేయూతనందిద్దాం



పరివర్తనలో పండ్లు పంపిణీ చేస్తున్న నలంద సిబ్బంది

సత్తెనపల్లి: పుట్టుకతోనే మానసిక వికలాంగులుగా జన్మించిన చిన్నారులకు, వృద్ధాప్యంలో వృద్ధాశ్రమాల్లో కాలం వెళ్ళదీస్తున్న వృద్ధులకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని నలంద ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాస్ కుమార్ చెప్పారు. సత్తెనపల్లి మండలం కంటేపూడి సమీపంలోని నలంద గ్రూప్ విద్యాసంస్థల ఫౌండర్, సెక్రటరీ, ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆరిమండ విజయ శారదా రెడ్డి జన్మదినం పురస్కరించుకొని పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు, అల్పాహారం, ఆదరణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నసంతర్పణ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ విజయశారదారెడ్డి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత అని, ఎందరికో ఉపాధి కల్పించిన ఆమె సేవలను కొనియాడారు. ముందుగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ కరీమున్నీసా, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ బ్రహ్మారెడ్డి, అడ్మిషన్స్ ఇన్‌చార్జ్ యుగంధర్ రెడ్డి, డిప్లమా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, హెచ్ఓడీలు డాక్టర్ విజయలక్ష్మి, పాల్సన్, శ్రీనివాస్ రెడ్డి, ఏవో శివారెడ్డి, అకడమిక్ ఏవో షరీఫ్, ఫిజికల్ డైరెక్టర్ చంద్ర వాసు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర భూ సర్వేతో సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

క్రోసూరు: జగనన్న సమగ్ర భూసర్వే పూర్తయితే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు చెప్పారు. ఎంపీడీఓ సమావేశ హాలులో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ షేక్ జమీలా, వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి , ఇన్‌చార్జి ఎంపీడీవో పి.శివరామయ్య, తహసీల్దార్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు రైతుల భూముల ఆన్‌లైన్ సమస్యలు పరిష్కారం కాకపోవటంతో బ్యాంకుల్లో రుణాలు, ప్రభుత్వం వేసే రైతు భరోసాలాంటివి పొందలేకపోతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ ఆన్‌లైన్ పనులు సక్రమంగా జరగటం లేదన్న విషయాలపై వివరణ ఇచ్చారు. భూ సర్వే పూర్తయితే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. పీసపాడు, పారుపల్లి గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేసి 99 శాతం మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చినట్లు వివరించారు. ఉద్యానశాఖ అధికారి సీహెచ్ జననీ మాట్లాడుతూ డ్రిప్స్, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు వెంటనే ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివిధ పంటలకు వర్తించే రాయితీలను వివరించారు. అనంతరం ఐసీడీఎస్ క్రోసూరు సూపర్‌వైజర్ మాధవి, దొడ్లేరు సూపర్‌వైజర్ రత్నకుమారి, ఎంఈవో ఏసురత్నం, ఏవో వేణుగోపాల్, పీఆర్ ఏఈ, హౌసింగ్ ఏఈ తమతమ శాఖల పరితీరు గురించి తెలియజేశారు.

## భూముల రీసర్వే పనులపై జేసీ అసంతృప్తి



కేజీబీవీలో ఆహార పదార్థాలను రుచి చూస్తున్న జేసీ శ్యాంప్రసాద్

ఈపూరు: మండలంలోని భూ రీసర్వే నిర్వహణ పట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వే అధికారులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రీ సర్వే పనులు వేగంగా జరగకపోవడానికి గల కారణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఈపూరు, బొమ్మరాజుపల్లి, గుండేపల్లి, చిట్టాపురం, కొండాయపాలెం, కొండ్రముట్ల, దాసులపల్లి గ్రామాలకు ఓఆర్ఐ మ్యాప్ వచ్చిందని తెలిపారు. భూ రీసర్వే పనుల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి రైతులకు భూహక్కు పత్రాలు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ముందుగా స్థానిక కేజీబీవీ పాఠశాలను జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయినీల హాజరు రిజిస్టర్, విద్యార్థినీల హాజరును పరిశీలించారు. మెనూ ప్రకారమే విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు సబ్జెక్ట్ ప్రశ్నలను అడిగి విద్యాబోధనపై పలు సూచనలు చేశారు.

## గృహసారథులపైనే బృహత్తర బాధ్యత

- వైఎస్సార్ సీపీ జయ రథసారథులు వారే
- మూడేళ్ళలో జరిగిన మేలును ప్రజలకు వివరించాలి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- బృగుబండలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి : ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులే వైఎస్సార్ సీపీ విజయానికి రథసారథులని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. బృగుబండ గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. మూడేళ్లలో జరిగిన మేలును ప్రజలకు గృహసారథులు వివరించాలని సూచించారు. మార్చి 18 నుంచి ఇంటింటికీ వెళ్లే కార్యక్రమం కొనసాగుతుందని, అందరూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో సంక్షేమ పథకాలను ఇంత పారదర్శకంగా అందించలేదని స్పష్టం చేశారు. తాను రాజకీయ అవకాశవాదిని కాదని, వైఎస్ రాజశేఖరరెడ్డి వెంట నడిచానని, ఆయన తదనంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో కలిసి విశ్వాసంతో పని చేస్తున్నానని పేర్కొన్నారు. ఒకే పార్టీని నమ్ముకొని ముందుకు సాగుతున్న అంబటి వెంట ఉంటారో, కుతంత్ర రాజకీయాలు చేస్తున్న తెలుగుదేశం, జనసేనల వైపు ఉంటారో తేల్చుకోవాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. శిక్షణ కార్యక్రమానికి బృగుబండ, పాకాలపాడు, కంకణాలపల్లి, ధూళిపాళ్ల, కందులవారిపాలెం గ్రామాల నుంచి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ, వైస్ ఎంపీపీ అన్నదాసు శ్రీనివాసరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ చిలుకా జయపాల్, సంకటి శ్యాంసన్, ధూళిపాళ్ల సొసైటీ చైర్మన్ నలబోతు శివన్నారాయణ, బృగబండ, పాకాలపాడు, గోగులపాడు, కందులవారిపాలెం గ్రామాల సర్పంచ్‌లు గందు పద్మావతి, తిప్పిరెడ్డి సుజాత లక్ష్మి, గుంజి విజయ్, వెంకటరెడ్డి, స్థానిక నాయకులు ఇనుకొల్లు దేశిబాబు,గంప.నరసింహారావు,చందుసాంబశివరావు,నరసింహరావు, దుగ్గి రాంబాబు, అన్నదాసు శ్రీహరి. 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ పాల్గొన్నారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యం భేష్

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: అంబేడ్కర్ భావజాలంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కొనియాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికలో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చినందుకు ఆయన సీఎం వైఎస్ జగన్‌కు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. అచ్చంపేటలో వైఎస్సార్ సీపీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. శంకరరావు మాట్లాడుతూ 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 మంది బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీకి అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. సీఎం వైఎస్ జగన్ హయాంలో 2 లక్షల శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తే వాటిలో అత్యధికంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయ ప్రతాపరెడ్డి, ఎంపీపీ రజనీబాయి, వైస్ ఎంపీపీ బాబు, పార్టీ మండల కన్వీనర్ చిలుకా చంద్రయ్య, బీసీ నాయకులు శ్రీను, షేక్ జానీ, షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ డెక్ ప్రారంభం

నరసరావుపేట: చిలకలూరిపేట రోడ్డు ఎస్ఆర్‌కేటీ జంక్షన్‌లో ఆధునిక హంగులతో క్రీడాకారులకు ఉపయోగపడేలా నిర్మించిన స్పోర్ట్స్‌డెక్ కాంప్లెక్స్‌ను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, అండర్-19 భారత జట్టు క్రికెట్ వైస్ కెప్టెన్ షేక్ రషీద్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ నరసరావుపేటకు ఇటువంటి క్రీడా మైదానాలు ఎంతో అవసరమన్నారు. దీని కోసం కృషి చేసిన కంజుల స్రవంత్‌ను అభినందించారు. క్రికెట్ కోర్టును క్రికెట్ క్రీడాకారుడు రషీద్ ప్రారంభించగా షటిల్, వాలీబాల్, ఫుట్‌బాల్ మైదానాలను డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, పొడా చైర్‌పర్సన్ మిట్టపల్లి రమేష్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్.ఏ.హనీఫ్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి ప్రారంభించారు.

## జిల్లా డైరీతో ప్రజలకు ఎంతో ఉపయోగం



నరసరావుపేట: కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా డైరీని కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగానున్న రెవెన్యూ, పోలీస్ అధికారుల సమాచారంతో పాటు నరసరావుపేటలోని హాస్పిటల్స్, వైద్యుల వివరాలతో కూడిన జిల్లా డైరీ జిల్లా ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం డైరీని రూపొందించిన సెయింట్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, న్యాయవాది వంకాయలపాటి రవి, తెలుగు సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. డైరీ రూపకల్పనకు సహకరించిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఐ అండ్ పీఆర్ డీడీ ఎ.ఎస్. దీప్తి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.బాలు నాయక్ పాల్గొన్నారు.

### నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పట్టణంలోని పురపాలక సంఘ హెడ్ వాటర్ వర్క్‌లో పాత వాల్వ్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నందున గురువారం పట్టణంలో మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి బుధవారం తెలిపారు. పట్టణంలోని 10, 9, 8, 7, 6, 5, 4, 3, 2, 1, 25, 26, 27, 28, 29, 30, 31వ వార్డుల్లోని నాగార్జున నగర్, క్రిస్టియన్ పేట, రైల్వే స్టేషన్ రోడ్, ముస్లిం ఏరియా, రంగా కాలనీ, అంబేడ్కర్ నగర్, వావిలాల్ నగర్, నిర్మలా నగర్ ప్రాంతాల్లో రక్షిత మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

### 25, 26 తేదీల్లో ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరం

సత్తెనపల్లి: ధూళిపాళ్ల ఎల్.వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో సత్తెనపల్లి కాకతీయ జన సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో ఈనెల 25, 26 తేదీల్లో రెండు రోజులపాటు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరుగుతుందని సమితి అధ్యక్షుడు యెల్లినేడి రామస్వామి, కార్యదర్శి రావెల చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, అర్హులైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామని వివరించారు.

### చేలల్లో పత్తి దొంగిలిస్తే కేసు నమోదు చేస్తాం

అమరావతి: పత్తిచేలల్లో గుడ్డిపత్తి నెపంతో చోరీలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ శివప్రసాద్ బుధవారం తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మండెపూడి గ్రామంలో పెనుమచ్చు సాయిబాబు పత్తిపొలంలో క్రోసూరు మండలానికి చెందిన మహిళలు పత్తిని దొంగిలించి ఆటోలో తరలించుకెళ్లారని, వారిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. రైతులు తమ పత్తిచేలల్లో ఎప్పటికప్పుడు గమనించుకుంటూ అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

### 25న పిడుగురాళ్లలో జాబ్ మేళా

క్రోసూరు: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, ట్రెనింగ్ శాఖ ఆధ్వర్యంలో పిడుగురాళ్లలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ, సీడ్ ఏపీ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిడుగురాళ్లలోని అగ్రికల్చరల్ మార్కెట్ యార్డులో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత తదితర సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. shorturl.at/cioAVలో పేర్లు నమోదు చేసుకోవచ్చునన్నారు. వివరాలకు 9160200652, 9010585360, 9866822697కు సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజుపాలెం: మండలంలోని గ్రామాల్లో గురువారం ఉదయం 7 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వి.వి.ప్రసాద్ బుధవారం తెలిపారు. కొండమోడులోని 132కేవీ విద్యుత్‌లైను మరమ్మతుల వల్ల సరఫరా నిలిపివేస్తున్నామని వివరించారు.

**నకరికల్లు మండలంలో..**

నకరికల్లు: మండలంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ రూఫస్ డానియేల్ బుధవారం తెలిపారు. 132 సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వల్ల ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

### గడ్డివామి దగ్ధం

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించి ఎకరన్నర పొలంలోని వరిగడ్డివామి దగ్ధమైన ఘటన మండలంలోని ఇరుకుపాలెంలోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. గ్రామంలోని నల్లగుండ్లవెంకటరావుకు చెందిన వరిగడ్డివామికి నిప్పు అంటుకొని మంటలు వ్యాపించాయి. స్థానికులు అందించిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.30 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

### తిరునాళ్లలో నిబంధనలు పాటించాలి

ఈపూరు: మండలంలో రాబోయే తిరునాళ్లను నిబంధనలను పాటిస్తూ ప్రశాంతంగా ఎలాంటి గొడవలు లేకుండా జరుపుకోవాలని ఎస్ఐ విప్పర్ల వెంకట్రావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా పొలిటికల్ బ్యానర్లను నిషేధించడమైందని, వీవీఐపీలు సాయంత్రం లోపు వచ్చి దర్శనం చేసుకొని వెళ్లేలా ఏర్పాటు చేయడమైందని, ప్రభలపైన కాని, వాటి వద్ద కాని రాజకీయ నాయకులు వచ్చి ప్రసంగించడానికి వీలు లేదన్నారు.